

# వరహాల బావి

శ్రీరమణ

రోహిణీకార్తె మధ్యాన్నపు ఎండ నిట్టనిలువుగా బావిలో పడుతోంది. బావి వంచ చుట్టూ కడవలు పెట్టగా పెట్టగా వొరుచుకుని కుదురుగా గుంటలు పడ్డాయి. నీరు నిండిన ఆ కుదుళ్లలో పిచుకలు కిచకిచలాడుతూ తలలు ముంచి స్నానాలు చేస్తున్నాయి. బావి లోపల తాబేలు నీళ్లపై తేలుతూ అంచులకి పట్టిన పాకుడు కోసం పాకులాడుతోంది.

గాజుల బల్ బావి ముందు ఆగి గుండె మీద చెయ్యి పెట్టి తల వంచాడు. బావిలో చేద వేశాడు. తాబేలు వులిక్కిపడి, గిరికీ కొట్టి చర చరా లోపలికి పారిపోయింది. చూసి తృప్తిగా నవ్వుకున్నాడు. బావి తొణికిస లాడింది. నీళ్లమీది ఎండ చెదిరింది. వెలుగుపాప బావి అంచుల చుట్టూ గిర్రున తిరిగింది. బావి ధగధగా మెరిసింది. గాజులబల్ చేదలాగి దోసిళ్లతో నీళ్లుతాగి తెల్లటి గడ్డం మీద జారుతున్న నీళ్లని పిండుకున్నాడు.

ఆ బావిలోకి తొంగిచూస్తే గాజుల బల్‌కి యాభై ఏళ్లనాటి తన వాలకం కళ్ల ముందు కదులుతుంది. అప్పుడు ఈ కుచ్చుల సాగా లేదు తెల్లగడ్డం లేదు పైజమా పొడుగు చొక్కా లేవు – అరగుండు అరలాగు తప్ప. సేల్ వెనకాల గాజుల మలారం బుజాన వేసుకుని తిరుగుతూ వుండేవాడు.

అసలప్పుడు యీ బావే లేదు. ఇక్కడ వరహాలమ్మ ఇల్లు వుండేది. ఇల్లంటే ఇల్లు కాదు చిన్న చుట్టుగుడిసె. అవతల వైపు మసీదు, ఇవతలవైపు కొంచెం లోపలగా శివాలయం అప్పటికీ యిప్పటికీ వూరికి ఒకటే పెద్ద వీథి. ఇదుగో మసీదు పక్కన రావిచెట్టు – అప్పట్నించీ దాని పేరు అదే – జెండాల చెట్టు. పచ్చటి ఆకుల మధ్య వెలిసిపోయిన జెండాలు, చిక్కుకు చిరిగి వేలాడే గాలిపటాలూ – కాస్త గాలి వేసినా గయ్యాళిలా గలగలమంటుంది జెండాల చెట్టు.

పొద్దునవూట గాలిగోపురం నీడ సాయంత్రంవేళ మసీదు నీడ వరహాలమ్మ ఇంటి మీద పారుతుండేవి. పావురాలు మసీదులో దొరికిన పప్పులు, మరమరాలు గాలిగోపురం గూళ్లలో కూచుని తినేవి. శివుడి గుళ్లో నేరేళ్లని మసీదు మీద కూచుని మెక్కేవి. మసీదుని ఆనుకుని మహమ్మదీయుల ఇళ్లు పాతిక దాకా వుండేవి. శివాలయానికి దిగువన వందకి పైగా హిందువుల గడపలు వుండేవి. అందరూ అందర్నీ

వరసలు పెట్టి పిలుచుకోడం తప్ప పేర్లు తెలిఇయవు. ఘోషాలు బురఖాలు జాన్తానై. ఉన్నవాళ్ళు లేనివాళ్లు అన్న తేడా లేదు. అందరూ లేనివాళ్లే. రెక్కాడితేగాని డొక్కాడని వాళ్ళే. పీర్ల పండగ వస్తే అందరూ జెండాలతో ఊరేగేవాళ్ళు. శివరాత్రి వసే ఊరంతా జాగారం చేసేవాళ్ళు. రథోత్సవం అందరిదీ. రథానికి రంగులు వెయ్యడం ఖాదర్ భాయ్ పని. కొయ్యకుసులు పెట్టి వొడుపుగా రథాన్ని నడిపించడం సత్తార్‌కి బాగా తెలుసు. శివుడి రథానికి సత్తారే సారథి.

అమ్మలగన్న అమ్మలా ఊరంతకీ పెద్ద దిక్కులా వుండేది వరహాలమ్మ. ఒక్కతే ఆ చుట్టుగుడిసెలో దేవుళ్ల నీడన వుండేది. ఎప్పుడూ ఎవరితోనూ ఎక్కువ మాట్లాడేది కాదు. హమేషా రాట్నం చప్పుడు ఒకే శృతిలో వినిపిస్తూ వుండేది. మసీదు వైపునించి వింటే "అల్లాహో" అన్నట్టు, గుడి వైపు నించి వింటే "ఓంకారం"లాగు వుండేది ఆ చప్పుడు. వరహాలమ్మ అంటే ఊరివాళ్లందరికీ ఎంత ఇష్టమో అంత భయం. చేతి చలవగల మంత్రసాని. పడుచుపిల్లలకి మల్లె మరువం మొగలి రేకులతో పూలజడలు వేసేది. కాల్లో ముల్లు విరిగితే నెప్పి తెలీకుండా తీసేది. కంట్లో నలుసు పడితే ఉపాయంగా తీసేది. తద్దె పండగలు వస్తే వరహాలమ్మకి చేతి నిండా పని. పట్టు మైనం కరిగించి అరచేతిలో చురుకు చురుకు చుక్కలు పెట్టి గోరింటాకు మెత్తేది. కాకరాకు, బంతి అకులు పెట్టి కోరిన వారికి కోరిన చందంగా గోరింట పూతలు పెట్టేది. ఆడపిల్లల అరచేతుల్లో పొద్దుపొడిపించేది. చుట్టుపక్కల ఊళ్లలో కూడా వరహాలమ్మ చేతిచలవ తెలుసు. మీది ఏ వూరు అని అడిగితే 'వరహాలమ్మది మా ఊరే' అని గర్వంగా చెప్పుకునేవాళ్లు. వరాలమ్మ ఆ ఊరికి కొండగుర్తు.

అయితే ఊరికి శాపం మంచినీళ్ళు. ఎక్కడ తవ్వినా నీళ్ళు పడతాయి గాని కటిక ఉప్పలు. కప్పలు చస్తాయి. కోడిగుడ్లు తేల్తాయి. వానాకాలం కుంటలు నిండితే ఆ నీళ్లు కొన్నాళ్లు తాగేవాళ్ళు. తర్వాత అమడ దూరం నించి తెచ్చుకోవల్సిందే. చెప్పలేని దిగులు ఊరివారి ముఖాల్లో తాండవిస్తూ వుండేది. ఆ ఊరికి పిల్లనివ్వాలంటే "వద్దులే... ఎడారి... ఎద్దడి నీళ్ళు" అని ఎవరూ ముందుకు వచ్చేవారు కాదు. ఊరివాళ్లకి యిదో చింత చిన్నతనమూ.

* * *

ఒక పంటల కాలంలో జాగీర్దారు శిస్తు వసూళ్లకి మందీమార్బలంతో గుర్రాల మీద బయలుదేరాడు. దారి మార్గంలో జాగీర్దారు కంట్లో నలక పడింది. గిలగిలలాడిపోయాడు. పరివారం యావత్తూ హడిలిపోయింది. పాపం కన్ను కొలిమిలా అయిపోయింది. హోదా, దర్పం, నిలువెత్తు విగ్రహం చిన్న నలుసుకి గులాం అయిపోయాయి. కళ్ళకి గంతె కట్టి గుర్రం మీద కూచోపెట్టి సరాసరి వరహాలమ్మ గుడిసెకి తీసుకువచ్చారు. కట్టువిప్పి చూసింది వరహాలమ్మ. ఆ బాధ చూసి "పర్వాలేదు నాయనా..." అని జాగీర్దారు తల నిమిరింది. నట్టింట నేల మీద కూచోపెట్టింది. వరలహాలమ్మ నాలికకి తేనె రాసుకుని సుతారంగా కంట్లో నాలిక కొన తిప్పింది. కంటి నలుసు నాలిక కొనతో వచ్చింది. జాగీర్దారుకి పోయిన ప్రాణం వచ్చినట్టయింది. కళ్ళు విప్పార్చి చుట్టూ కలయచూశాడు. పరివారం అంతా బయట ఆత్రుతగా నిలబడి వుంది. కంటి నలుసంత సంకోచం కూడా లేకుండా దర్జాగా వరహాలమ్మ కాళ్లకి వంగి మొక్కాడు. జరీపాగా, రొంటిన వున్న మొహిరీల సంచీ తీసి ఆమె పాదాల దగ్గర వుంచాడు. మౌనంగా చేతులు కట్టుకుని వెనక్కి వెనక్కి అడుగులు వేసుకుంటూ వెళ్ళి గుర్రం ఎక్కాడు జాగీర్దారు. గుర్రాలు టకటకా కదిలాయి.

జరిగిన విశేషం గురించి ఊరూవాడా కథలు కథలుగా చెప్పకున్నారు. వరహాలమ్మ వైఖరిలో ఏమీ మార్పు లేదు. రాట్నం తిప్పతూ తన తపస్సులోకి తాను వెళ్లిపోయింది.

* * *

ఒకరోజు వున్నట్టుండి రాట్నం చప్పుడు ఆగిపోయింది. సడీచప్పుడూ లేదు. ఊరివాళ్లు ధైర్యం చేసి లోపలికి వెళ్ళి చూశారు. వరహాలమ్మ రాట్నం మీద వాలి వుంది. తీసిన బార తీసినట్టే వుంది. చేతిలో ఏకు చేతిలోనే వుంది. ఊరు ఊరంతా ఒక్కసారి బావురుమంది.

"మాయమ్మ వెళ్లిపోయిందా – మా దేవత యింక లేదా" అని గోడుగోడున ఏడ్చారు.

"ఏమి తినేదో, ఎట్టా బతికేదో ఎవరికీ తెలియదు. ఎవరినీ ఏనాడూ చిన్న మెత్తు సాయం అడిగి ఎరగదు..."

"ఎంతమందికి బొడ్డుకోసి పేర్లు పెట్టిందో... చేలవగల తల్లి..."

అందరూ వరహాలమ్మ మంచితనాన్ని తల్చుకుని వాపోయారు.

## ☆ మాతృభాష ☆

ఉదయం అయినా సరే
మంచు కప్పిన మలుపు ప్రమాదమే
సూర్యుడైతేనేమి
వాన కురిపించనప్పుడు
మాటిమాటికీ మట్టిపేరు తెస్తావు
నీ అనుభవం మట్టిలో ఇంకి
ప్రాణమై పూస్తుందో లేదో
పెదవుల్లోంచి శవాలు రాలిపడి
అంతా విశ్వబ్దదుర్గంధం వ్యాపిస్తుంది
నేనే జనం అయినప్పుడు
నా గురించి నాకే వివరిస్తావు
అన్ని భాషలూ నువ్వే మాట్లాడతావు
నా మాతృభాషతో సహా

నీ అక్షరాలు
అడవిలో గడ్డకట్టిన
నెత్తురుకు పట్టిన చీమల్లా కనిపిస్తాయి
నీ అహం
నా సహనంపై బరువు మోపుతుంది
గుడ్డివాడు దేన్ని చూసి నవ్వుతాడో నీకు తెలియదు
దిగులుగాలిలో తలపట్టుక్కూచున్న తడివేళ్ళ స్వగతాలు నీ కర్థం కావు
అర్థరాత్రి తలుపు తట్టే వానగోడు వినిపించదు
నువ్వు నిర్దేశించే అరలు పొరలే వాస్తవం నీకు
నువ్వు నిలబడ్డ చోటునుంచే చూడమంటావు
పక్షుల కన్రెప్పలు విప్పిన
ఆకాశాన్ని చూస్తాన్నేను
విశ్వాంతరాళ విచిత్రశబ్దాలు రికార్డు చేస్తాను
నేనే జనం అయితే
నాగురించి నాకే ప్రవచిస్తావు
నా మాతృభాషని
నీ నాలికతో లిఖిస్తావు
పరవాలేదు
నేను గాయపడి చచ్చిపోతున్నప్పుడు
నా ఆఖరిస్పందన
నీకెప్పటికీ అందదని తెలిసి నవ్వుకుంటాను.

– డాక్టర్ ఎన్.గోపి

మర్నాడు ఊరి పెద్దలు చుట్టుగుడిసె అంతా కలయతిరిగి చూశారు. చెంబు, గిన్నె, రాట్నం తప్ప ఏమీ లేవు. పైకి తేలకపోయినా పెద్దలందరికీ జాగీర్దా రిచ్చిన మొహిరీలు ఎక్కడ దాచిందో నని ఆత్రుత, ఆరాటం... ఆపుకోలేక ఒక్కొక్కరే లౌక్యంగా బయటపడడం మొదలెట్టారు.

"గాలికి పోతే ఏమొస్తుంది..."

"...మరే మరే... మట్టయిపోతే ఏమిటి లాభం... ఆయమ్మ పేరు చెప్పకుని ఊరి బాగు కోసం ఏమైనా చేసుకోవచ్చు..."

"దొరికితే గదా... ఏం చేసుకున్నా."

"వెదికితే గదా దొరికేది..."

ఆలోచన బయటకి రావడమేమిటి – పనిలోపడ్డారు జనం.

గుడిసె పీకి పక్కన పడేశారు. ఆకు ఆకు వుల్ల వుల్ల వెదికారు. ఎక్కడా మొహిరీల జాడ లేదు.

"బంగారం ఆకుల్లో కప్పెడతారా – మట్టిలో చూడండి" అని ఓ పెద్దా యన సలహా విసిరాడు.

పారలు, పలుగులు, తట్టలు, బుట్టలు వచ్చేశాయి. క్షణంలో తవ్వ కాలు మొదలైనాయి.

"అదే కైవారం – అదే గుడిసె హద్దులో తవ్వండి" పైనించి సలహాలు ఇస్తున్నారు.

"ముసిల్ది గట్టిదే... తను తినక పోతే మాలె... వూరికి అప్పగించి పోవచ్చుగా..."

"పోతావని కలగన్నాదేంటి..."

"పెద్దతనం గదా... మూలపడితే వుంటదని దాచి వుంటది పాపం... మల్లెవువ్వులా రాలిపోయింది."

ఎక్కడలేని శక్తి తెచ్చుకుని తవ్వకం సాగిస్తున్నారు. ఆశ దయ్యంలా ఆవ రించి పని వడిగా జరిపిస్తోంది.

నిలువు లోతు తవ్వారు. ఖంగున చప్పడైంది – పలుగు వేటుకి. ఉత్సాహం పెల్లుబికింది. ఒడ్డున కూచున్న వాళ్లు కూడా గుంటలోకి దిగిపో యారు. కాలూ, చెయ్యి పలుగూ పారా కదిలే సందు లేదు.

పలుగులు పక్కన నాటి చేతులతో మట్టి లాగారు. చివికిన తలపాగా – జరీపోగులు వలలా చుట్టుకువున్నాయి. ఆ వలలో పగిలిన మట్టిపిడత పెంకుల మధ్య మొహిరీలు మిలమిలలాడాయి.

"ఉన్నాయిరోయ్..."

"దొరికాయ్... దొరికాయ్..." ఆనం దంగా అరువులు వినిపించాయి.

"ఎక్కడికి పోతాయ్... అసలా మడిసి ఎట్టాంటిది... మన కోసం బతికిన మడిసి"

"మనకి యిచ్చేపొయ్యేది కాని అనుకోకుండా దీపం కొండెక్కింది... దాంతో యీ తిరకాసు వచ్చిపడింది..."

నిధి పైకి చేరింది. బంగారు తాళ్ల ఉట్టిలో పెట్టినట్టుంది మొహిరీల పిడత.

"చూశారంట్రా... అప్పటి జాగీర్దారు జలతారు తలపాగా... వరాలమ్మ కాళ్ల దగ్గర పెట్టాడు గదా..." – అంతా విడ్డూరంగా చూస్తున్నారు.

"శివద్రవ్యం శివసన్నిధికి చేరింది... అంతా శివలీల" అన్నారు వూజారి గారు.

స్థలం మీదో మాదో తేలుద్దాం... కర ణంగారిని పిలవండి" అన్నారు.

"మీరూ మేమూ ఏవిట్రా అబ్బీ... అందరం ఒహటే. అందరి రక్తమున్నూ ఎరుపే..." – అన్నారు వూజారిగారు.

"ఎరుపే... మహ చెప్పావుగానీ చెట్లన్నీ పచ్చగానే వుంటాయి– మరి చించిగురు వుల్లగా వుంటది, వేపాకు చేదుగా వుంటదేం..." – అన్నారొకరు వెటకారంగా.

నిధి చుట్టూ జనం – ఆక్రోశం ఏ క్షణాన కట్టలు తెంచుకుంటుందో తెలి యదు.

కొలతలకి గొలుసు, కర్రలు దస్త్రా లతో కరణంగారు హాజరైనారు.

"మీరు న్యాయం చెప్పండి" – అన్నారు కరణంగారిని చూస్తూనే.

"తరుజల పాషాణ నిధి నిక్షేపాలన్నవి




వూజారి వంక నలుగురైదుగురు ఎగాదిగా చూశారు.

"శివుడిది ఎట్టయితది... ఇచ్చింది మా ఆద్మీ..."

"అయితే..."

"మసీదు మీద కర్చు చేస్తాం..."

"నిధినిక్షేపాలన్నవి ఎవరి స్థలంలో దొరికితే వాళ్లకే చెందుతాయి."

"ఈ స్థలం నీ బాబుగాడిదా"

"నీ అబ్బగాడిదా"

"ఈ స్థలం పోరంబోకు"

"నువ్వు కూడా..."

వాతావరణం మారింది. గాలి బరు వెక్కింది. కత్తివేటుకి చీలిన వెదురల్లె ఊరు రెండుగా చీలింది. మసీదు – శివాలయం –

"ఈ గొడవంతా దేనికి... అసలీ వున్నాయి చూశారూ... అయినా దేనికి కొలత లాగుతున్నాం కదా..." అని కరణంగారు మాట దాటేసి పనిలో పడ్డారు. "కరణమయ్యా అన్యాయం చెయ్యకు... నువ్ గ్రామాధికారివి, నీకు అందరం ఒకటే..."

"ఎంత మాట దేవుడికీ, నాకూ అందరూ సమానమే. పోనీ ఓ పని చేసుకోరాదూ.. ఈ కొలతలూ కరా మండులూ తేలేవి చచ్చేవి కావుగాని అధికారిగా నాకో పది జమవేసి మిగ తావి సాహం సాహం తీసుకోరాదూ... గాలికి పొయ్యే పేలపిండి..."

"అబ్బ కరణీకం దెబ్బ అనిపించావు సామీ... అదేం కుదర్దు – అటో ఇటో తేలాల్సిందే"

"అసలు వరాలమ్మ మా మడిసి"

"అసలు సొమ్మిచ్చింది మావోడు"

"ఊరికే దానం యిచ్చాడా – మా యమ్మ ప్రాణం పోసింది"

"అయితే యివ్వాలని తాఖీదు వుందా... ఇది అల్లా సొమ్ము... అంతే – కాదంటే"

"కాదంటే...?"

"ఖతం.."

"తలతీసి మొలేస్తావా"

"రకతం ఏతాం వేస్తాం"

కందకంలో పాతిన పలుగులు వొరిగి వొరిగి పడకపెట్టాయి. జెండాల చెట్టు మౌనంగా వుంది. అరువులూ కేకలూ మసీదు గోడకీ, గాలిగోపురానికీ తగిలి ఒకే తిట్టు పదేపదే వినిపిస్తోంది. మాటా మాటా పెరిగిపోయింది. పిడి కిళ్లు లేచాయి.

ఒక్కసారి కందకంలోంచి బుస్సున చిచ్చుబుడ్డిలా నీరు చిమ్మింది. అంతా వులిక్కిపడ్డారు. భయంతో వెనక్కి తగ్గారు. పిడికిళ్లు సడిలాయి. చిమ్ము తున్న నీళ్ళలో తడిసి చల్లబడ్డారు.

నీళ్ళు నీళ్ళు అని అరిచారు. పాతాళ గంగ పైకి జిమ్ముతున్న నీళ్ళని చేతులు జాచి భయం భయంగా తాకారు. కొందరు ధైర్యం చేసి నోట్లో పోసుకు చూశారు.

"నీళ్ళు కావు టెంకాయ పాలు" అన్నారు రుచి చూసి.

"ఆహా పాలంటే పాలే – పిల్లికూ నల్ని పెంచచ్చు..."

అంతా కోలాహలంగా వుంది. ఎగ బడి దోసిళ్ళతో నీళ్ళు తాగారు. జరిగింది కలా నిజమా తెల్చుకోలేని ఆశ్చర్యంలో మునిగివున్నారు జనం.

"అంతా వరాలమ్మ చలవ... ఆమె దొడ్డగుణం యీ తీరున నీరై యింకి పాలై పొంగింది..."

"ఆ తల్లి నడిచిన నేల నీటిపట్టు... ఎందరికి సాయం చేసిందో... తేనె టీగలా చుక్కచుక్కగా కూడబెట్టిన మంచితనం మంచినీరం అయింది."

కాసేపటికి పొంగు తగ్గింది. బుడ బుడ చప్పడుతో నీరు పొర్లుతోంది.

వరాలమ్మ సిధిలో బావి కట్టడానికి నడుం కట్టారు. ఊరు ఊరంతా ఎవ రికి చేతనైన పని వాళ్ళు చేశారు. నిధితో కొనుగోలు చేయాల్సినవి చేశారు. రాతి కూర్పు తెలిసినవాళ్లు కట్టుబడి పనికి దిగారు. ఆడవాళ్ళు రాళ్ళు మోశారు.

అయిదు బారల కన్ను – నాలుగు నిలువుల లోతు – రాతితో చుట్టూ వంచకట్టారు. బావి కంటికి కాటుక దిద్దినట్టు నల్లరాతి బొడ్డు కట్టారు. వరహాల బావి అని పేరు పెట్టారు. చుట్టూ రాళ్లు పరిచి చప్టా కట్టారు. చప్టా చివర పెద్ద రాతి తొట్లు పశువుల నీళ్ళకి కట్టారు. చప్టా చివర పెద్దరాతి తొట్లు పశువుల నీళ్ళకి ఏర్పాటుచేశారు.

"సాక్షాత్తూ ఆ గంగమ్మ తల్లి నేలకి దిగింది" అన్నాడు పూజారి.

"అల్లా మంజూర్ చేసిన ఒయాసిస్" అన్నాడు కాజీ.

ఊరికి శాపం తీరిందన్నారు. ఊరికి అయిదోతనం వచ్చిందన్నారు.

తాగాళ్లు వేసిన వరహాల బావి కొమ్మ చాటు చందమామలా తోచింది.

శివయ్యకి నిత్యం క్షీరాభిషేకాలే అయినాయి.

* * *

బావి వెలిశాక ఆ ఊరి కళ మారింది. ఊరివాళ్ల ముఖాలలో దిగులు తీరింది. వాళ్ళ బతుకులో వరహాల బావి ఒక భాగం అయింది.




ఆ ఊరికి అది రచ్చబండ–చలివేంద్రం–దిక్కు–మొక్కూ, తల్లి–దేవుడు–ఊపిరి– నీళ్లు– సిరీసంపదా అన్నీను. వరహాలమ్మ బావికంట కనిపెడుతూ కాపాడుతుందని వాళ్ల నమ్మకం.

నిజానిజాలు తేలాలంటే చిట్టచివరి అస్త్రం వరహాలబావి మీద ప్రమాణం చేయించడం – పెళ్లి ఊరేగింపు అక్కడ ఆగాలి. కొత్త జంటకి ఎర్రనీళ్లు దిష్టితీయడం ఆనవాయితీ. ఇరవై ఒకటోరోజు పసిబిడ్డని తొట్లో వేసి, బాలింతచేత బావిలో చేద వేయించి పేరంటం చేయడం రివాజు. అత్తారింటికి వెళ్లే ఆడపిల్లలు అక్కడ ఆగి బావిచుట్టూ తిరిగి మొక్కుకు మరీ వెళ్తారు. వరహాలమ్మ దీవిస్తే ఏ గండం లేకుండా దబ్బపండులాంటి పిల్లలు పుడతారని నమ్మకం.

బావి పొంగిన రోజు గాజులబత్ అక్కడే వున్నాడు. ఆ నీటిధారలో అరగుండు అరలాగు తడువుకుని ఆనందించాడు. ఎక్కడో దారిపక్క చెరువులో తాబేలు పిల్ల కనిపిస్తే కుండలో భద్రంగా తెచ్చి బావిలో వదిలాడు. అప్పడెంత అది బుల్లి రావిచిగురంత వుండేది. ఇప్పుడు తామరాకంత అయింది.


"ఆ పక్క శివుడు – ఈ వైపు అల్లా... మధ్యన కూర్మావతారం సాక్షాత్తూ విష్ణుమూర్తి... అంతా ఒక్క గడ్డమీద కొలువుతీరారు... బావికి దైవత్వం వచ్చేసిందిరా అబ్బీ..." అన్నారు పూజారిగారు. ఆ మాటలకి గాజులయ్య తెగ గర్వపడ్డాడు.

అప్పట్నించీ ఊళ్లోకి రాగానే బావి నీళ్ళు ఓ గుక్కెడు తాగడం, తాబేలుని ఓసారి చూసుకోడం గాజులబత్‌కి ముఖ్యవిధి అయింది.

సేర్ వారసత్వంగా మలారం అప్ప చెప్పి వెళ్ళిపోయాడు.

"నోరు మంచిదైతే ఊరు మంచిది అవుతుంది బేటా..." అన్న సేర్ మాట నమ్ముకున్నాడు. గాజులబత్‌కి అదే పెట్టుబడి అయింది.

ఏ గడప యెక్కి "అమ్మా మంచి నీళ్లు కావాలి" అంటే ఏ తల్లి అయినా మజ్జిగ తెచ్చి ఇస్తుంది. ఆవూళ్లో గాజులయ్య పలుకుబడి అలాంటిది. పూసల్లో దారంలా మలారం బుజాన వేసుకుని పది పూళ్లూ తిరుగుతాడు. అన్ని పూళ్ల యోగక్షేమాలూ తెస్తాడు. పెళ్ళి సంబంధాలు చెబుతాడు. పాడి గేదెల బేరాలు తెస్తాడు. "వైద్యానికి




MAM/NCL/204

పట్టుతేనె కావాలోయ్" అని పంతులు గారు అడిగితే సాధించుకు తెస్తాడు.

లేవలేని పిల్లకి జున్నుపాలు మీద మనసైందంటే "అదెంత పని తల్లీ" అంటాడు. అన్నమాట నిలబెట్టుకుంటాడు.

ఈ ఊళ్లో తల్లి పైసలిస్తే ఆ ఊళ్లో బిడ్డకి గాజులు తొడిగి వస్తాడు.

మలారం లోపల సీసాలో దాచిన ఖర్జూరపు పళ్లు శక్తికొద్దీ పిల్లలకి పందారం చేస్తాడు.

గాజులంయ్య ఊళ్లోకి వస్తే వూరంతా గలగలలాడుతుంది.

పందెపు కోళ్ల సమాచారం తెచ్చి కుర్రకారుకి హుషారు తెప్పిస్తాడు. కుర్రకారు గాజులయ్యని వేళాకోళం చేస్తుంటే రోషం తెచ్చుకోకుండా ఆనందించేవాడు.

"అన్నీ ఆడంగి కబుర్లే..." అని కుర్రాడు ఎగతాళి చేస్తే–

"ఓయబ్బ... పెద్ద మొగాడివి... పెళ్ళయి మూణ్ణెళ్ళయింది... అమ్మాయి చేతులు చెక్కర్లేదు – ఏం మొగాడివిరా బిడ్డా... నయా కాపరంలో వూటా రెండు గాజులేనా చిట్లకుంటే మర్యాదేముంటది...?"

"నీమాటలకేం రోషపడం... మాటలు చెప్పి ఆఖరికి మొగాళ్లకి కూడా గాజులు తొడుగుతావ్..."

"ఏం లేదు అల్లుడూ తొందరగా సీమంతం గిరాకీ తగుల్తుందని ఆశ – జల్ది ఆడపిల్ల వుడితే ఈ తాతకి ఇంకో రెండు చేతులు దొరుకుతాయ్ గదా..." – హాయిగా గడ్డం నిమురుకుంటూ అనేవాడు.

"అసలు నీ పనే రొఖ్ఖం... డబ్బులిచ్చి కాళ్లకి మొక్కుతారు ఏ వ్యాపారంలో వుంది చెప్పు.."

"అదేవుంది భయ్యా... బేరం బేరమే దణ్ణం దణ్ణమే. నేను రూపాయ్‌కి దస్ అంటే ఆ తల్లి పదహారంటది.... తొడిగేప్పుడు చిట్లిన గాజులకి పూచీ నాదే... గొంగళి మీద కూచున్నాక గాజులబత్ దేవుడే అయినా బేరం బేరమే..." వ్యాపార ధర్మం చెబుతుంటే పూజారి గారు అందుకుని – "అంతే... దేనికదే... గుడి గోడకి పిడకలు కొట్టద్దని చెబితే వింటున్నారూ.. దేవుడు దేవుడే పిడకలు పిడకలే.. అబ్బే యీ ఆడంగులు మరీను..." అని బాధపడేవారు.

* * *

వైశాఖమాసం రాగానే బావి పూడిక తీయడం ఒక పెద్ద సంబరం. ఏటా జరిగే వేడుక. తీర్థంలా సాగుతుంది. రెండు రోజులకి సరిపడా నీళ్లు నిలవపెట్టుకోమని వూరంతటికీ ముందే హెచ్చరిక చేస్తారు.

ఆ రోజు బాషా జట్కాబండి కట్టడు. పోతరాజు ఒంటెద్దు బండికి సెలవు. గాజులయ్య మలారాలు లేకుండా తెల్లవారు జామునే ఊళ్లోకి వస్తాడు. మొదటి చేద గాజులయ్యదే. అక్కడనించి పాతికమంది ఒక జట్టుగా నీళ్లు తోడడం మొదలుపెడతారు. తోడిన నీరు బావి చప్టా మీద కుమ్మరిస్తే అవి సన్నటి కాలవలోంచి ఆలయం అనుకు వున్న దేవుడి మాన్యానికి వాలుచేస్తారు. ఒక జట్టుకి అలుపు వస్తే మరో జట్టు సిద్ధం అవుతుంది.

ఓ నిలువులోతు నీరు తగ్గాక, బారెడు పొద్దెక్కాక గజ ఈతగాళ్ళు బావిలోకి దిగుతారు. పడుచు, ముసలి, పిల్లా జెల్లా ఊరు ఊరంతా అక్కడే వుంటుంది. ఎన్ని అన్నపు గిన్నెలు అడుగంటుతాయో, ఎన్ని కూరలు మాడిపోతాయో, ఎన్ని పాలు దాలిపాలవుతాయో తెలీదు. ఎందరు కోడళ్ళు అత్తలచేత చివాట్లు తింటారో లెక్కలేదు. చూసేవాళ్లకి యివీ వేడుకగానే వుంటాయి.

దిగిన ఈతగాళ్లు అడుగుదాకా వెళ్లి బురదమన్ను తీసి జల్లిగంపలలో వేస్తే పైనించి తాళ్ళతో లాగుతారు. ఆ వూడిక మట్టిని గట్టు మీద వేసి జాగ్రత్తగా జల్లెళ్లతో దేవితే – కాళ్లపట్టాలు, దుద్దులు, నాంతాళ్లు, ఉంగరాలు, ముక్కుపుడకలు, జడకుచ్చులు, కలాలు, బంగారు గాజులు, ఇనప కడవలు, ఇత్తడి బిందెలు, ఎద్దుల పట్టెడ మువ్వలు ఎన్నెన్నో పైకి చేరేవి.

తడిపొడి చిత్తడిలో ఆడపిల్లలు పైట బిగించి వయ్యారంగా నీళ్ళు తోడుతుంటే కుర్రకారు తనివితీరా చూసి వినోదిస్తారు.

"కాలు జారుతుంది జాగ్రత్త..." అంటూ అతిచొరవగా ఆడపిల్ల నడుం మీద చెయ్యివేసి రక్షించబోయే ప్రయత్నంలో విదిలింపులు తిని ఆనందించేవాళ్లూ వుంటారు.

"బుంగమూతికి చేంతాడు బిగించండి" అంటే

"ఎందుకులే ఉచ్చు బిగించేవుంది" అని మాటకిమాట వడ్డింపులూ–

"కన్ను చూడు ఎంతుందో..." అని ఆశ్చర్యపోతే


"ఇంతకాలం చూసెరగవా నంగనాచీ" – అంటూ అంతగానూ విస్తూపోయేటివాళ్లూ–

అమ్మో బుగ్గలు... బుగ్గలు... నీటి బుగ్గలు – అని చమత్కారించేవాళ్ళూ –

వడిసెల తిప్పినట్టు జడ విసిరితే, కుప్పెలు ఛెళ్లున తగిలితే కష్టసుఖాలు ఒకేసారి అనుభవానికి వచ్చేవి కుర్రాళ్ళకి. మోకాళ్ల మీదికి కోకలు బిగించి అరటి తోటలో నీళ్లు జాలు చేస్తూ పడుచు పిల్లలు పై పెత్తనం చేస్తుంటే – ఆ చక్కదనం చూసేందుకు వరహాల బావి కన్ను చాలేనా?

సాయంత్రానికి సందడి సద్దుమణిగేది. దొరికిన వస్తువులన్నీ బావి వంచ మీద ప్రదర్శన పెడతారు. గుర్తులు

## కాంతి సూక్తము



ఈ అమావాస్య యామిని నెదియొ యొక్క
దీపలోకము మెలమెల్ల దిగెనొ యేమొ
అబ్ధివేష్టిత ధరణిపై నద్భుతముగ
కాంతి సందోహ విభవంబు క్రందు కొనియె.

ఔనె! దీపావళి నిర్మలాభిధాన
పర్వశర్వరి యిది – తమః ప్రాభవములు
ఖర్వమైపోయె నవహర్షకౌతుకాప్తి
సందడింపవె జనమనః కందరములు

వత్సరంబున కొకసారి వచ్చి పోవు
బంధువరుదెంచె చెలి! గృహప్రాంగణమున
దీపికలు తీర్చి దిక్కుల తేజరించి
స్వాగతము పల్కుమా సఖీ సహిత వౌచు

ఓహో! సాత్రాజితీ విజయోత్సవైక
చండతరదుందుభి ధ్వానసఖములౌచు
వైభవోపేత మహితాంధ్రవాటి నెందు
బాణసంచాల ఫెళఫెళార్భటులు మించె

ఒక్కచో చిచ్చుబుడ్డులు విక్కి వెలిగె –
విష్ణుచక్రము లొక్కచో విర్రవీగె–
పూలు విరజిమ్మె కాకరపువ్వులచట –
తళుకు బెళుకులు చిందె మతాబులిచట.

ఎచట చూచిన దివ్వెలే యెచట భిన్న
శ్రవణ భీకర మంజుల స్వనములౌర!
వీనులకు కన్నులకు కూడ విందుగొలుపు
కలదె దీపాళి కంటె నిక్కపు పసందు

– శనగన నరసింహస్వామి

చెప్పి తమవి తాము తీసుకోవాలి. ఆడవాళ్ల నగలకి రెండో సాక్షి గాజులయ్య. ఏ తల్లి నగ ఏదో ఆనవాలు పట్టి చెప్పేవాడు.

గచ్చకాయలు, సీసం గోళీలు కుప్ప పోసి పిల్లలందర్నీ పిలిచేవాడు. పిల్లలు బిలబిలా వచ్చి గుర్తులు చెప్పాక చెవులు మెలేసి "మీరంతా నా తాబేలు మీద వేసినవి ఔనా... చుప్..." అని అరిచేవాడు. గుంజీలు తీయించి ఇంకెప్పుడూ తాబేలు మీద వెయ్యమని చెప్పాక వాళ్ల గోళీలు, గచ్చకాయలు యిచ్చేసేవాడు.

పూడిక తీసిన బావి ఆదమరిచి హాయిగా నిద్రపోతున్న పచ్చిబాలింతలా వుంటుంది. తడి తగిలిన అరటి తోట పచ్చగా వొళ్లు విరుచుకుంటుంది. రెండో రోజుకి బావినీరు వెన్నెల తేరుకున్నట్టుంటుంది. ఇది ఏటా జరిగే తిరునాళ్ల.

* * *


పొద్దు వాలుతోంది. పనుల నించి అప్పుడే ఒక్కొక్కరూ పల్లెకు చేరుతున్నారు. బావి గట్టు సందడిగా వుంది. ఒక వైపు నించి బాషా గుర్రబ్బండీ – మరో వైపునించి పోతురాజు ఒంటెద్దుబండీ వచ్చి బావి దగ్గర ఆగాయి. ఊరికే మాటవరసకి ఒంటెద్దు అంటారుగాని అది నిజానికి వొట్టిపోయిన ఆవు. దాంతోనే నీళ్లపీపా లాగించి ఏదో నాలుగు డబ్బులు చేసుకుంటున్నాడు పోతురాజు.

బళ్ళు సాంతం దింపీ దింపకుండానే గుర్రమూ, ఆవూ నీళ్ల తొట్టి మీద ఎగబడ్డాయి. చాకిరీ చేసిచేసి వున్న తిక్కలో వున్నాయేమో తొట్లో ముట్టెముట్టె తగలగానే రెచ్చిపోయాయి. ఒకదాని మీద ఒకటి తిరగబడ్డాయి. రెండూ బక్కజీవాలే. బాషా గుర్రం ఈకలు తీసిన కోడిలా వుంటుంది. కుమ్ముకుంటున్న వాటి మీద బాషా విసిరిన చెర్నాకోలు ఆవుకి తగిలింది. బండి దింపి వస్తున్న పోతురాజు అది చూశాడు.

"ఏరా" అని హూంకరించాడు.

"హేరా" అన్నాడు అదే శ్రుతిలో బాషా.

రావిచెట్టు గలగలమంది. వెలిసిన జెండాలు రెపరెపలాడాయి. ఇనప కడవలు బావి వంచకి తగిలిన చప్పుడుకి బావి తొణికి గజగజలాడింది.




"ఎప్పట్నించో చూస్తున్నా ఏంటి నీ రువాబు"

"నా ఎద్దునెందుకు కొట్టాలు... నువ్వేమన్నా దానికి గుగ్గిళ్ళు పెడ్తున్నావా?"

"సోబే... ఆట్టే వాగితే నీకూ పడుతుంది చెర్నాకోల వాత..."

"కొట్టు చూద్దాం..."

"మాట తూలద్దు..."

జనం పోగయ్యారు. నలుగురు ఇటూ నలుగురు అటూ చేరారు.

"రౌతు మెత్తకైతే గుర్రం మూడు కాళ్ల నడిచిందనీ... మెతగ్గా వూరుకుంటున్నకొద్దీ మీదెక్కుతున్నారు.."

"అసలు న్యాయం ఎక్కడుంది?"

"ఇక్కడ లేదా న్యాయం..."

"ఆ మహా బాగా వుంది న్యాయం. పూడిక తీసినపుడల్లా బావినీళ్లు అందరి రెక్కల కష్టం మీ మాన్యానికి పెడుతున్నాం గందా... అరటి తోటలో ఒక్క తొడిమగాని, ఆకుగాని మాకు ఇచ్చారా?"

"అసలీ బావి మా మసీదు గడ్డమీద వుంది..."

సుడిగాలిలా పుకారు ఊరు మీద పడింది. డొంకంతా కదిలింది. "పోతురాజు ఎద్దు మీద జట్కాగుర్రం తిరగబడిందిట. గోమాతని గుర్రం కొమ్ముల్తో చీల్చేసిందిట... గోవు రక్తం మడుగులో వుందిట–!"

"అయ్యో! అయ్యో! పుకారంటే ఇదే... గుర్రానికి కొమ్ములు మొలుస్తాయ్..." – పూజారి వచ్చే జనానికి నచ్చచెప్పాలని అడ్డం వెళ్ళాడు. ఆయన అక్కడ వుంటే ప్రమాదమని ఇంటావిడ పూజారిగారిని చరచరా లాక్కెళ్ళి వాహనశాలలోకి నెట్టి తలుపు ఘడియ వేసింది.

గాలి వార్త రకరకాల రంగులు పులుముకుని ఊరిమీద పడింది. ఊరి వాళ్లంతా చేతికి దొరికిన ఆయుధం పట్టుకుని వరహాల బావి వైపు పరుగులు తీస్తున్నారు.

అక్కడే వున్న గాజులయ్యకి మెదడు మొద్దుబారింది. బావి వంచన కబేళా కత్తి పదును పెడుతుంటే ఆ గరగరలకి వరహాల బావి ప్రతిధ్వనించి ఆకాశం ఉరుముతున్నట్టుంది.

ఒక పలుగు మొన బావి వంచన ఖంగున పడింది. గ్రామదేవత కణత అదిరింది.

"– 'ముద్ద ముద్దకి బిస్మిల్లా' అని ఎన్నాళ్లీ గొడవ. బావి పూడుస్తాం – పీడా వదులుద్ది."

మట్టి పిడికిళ్లు లేచాయి. కత్తులు గొడ్డళ్ళు లేచాయి. పలుగులు లేచాయి. కర్రలు కదులుతున్నాయి – ఎన్నడూ లేని బురఖాలు వేసుకుని ఆడవాళ్ళు మసీదు గోడవారగా నిలబడి, పిల్లల్ని అక్కున చేర్చుకుని బిక్కు బిక్కు మని చూస్తున్నారు.

"గ్రామదేవత బొట్టు చెరిపేస్తార్రా – మీ నోట్లో మీరే దుమ్ము కొట్టుకుంటార్రా..." – పూజారి వాహనశాల లోంచి కంఠం చించుకు అరుస్తున్నాడు.

"వరహాలమ్మ కంట్లో దుమ్ము పోస్తారా..." – రోదిస్తూ అన్నాడు గాజులయ్య –

"పరదేశిగాడివి – నీకెందుకు మా గొడవ – పో బే..." అని గసిరారొకరు.

గాజులయ్యకి మాట పడిపోయింది.

"బావిలో మట్టి పడిందంటే పుచ్చెలె గిరిపోతాయ్"

"నెత్తురు కాలవలు కట్టాల..."

"నెత్తురు ఏతాం వేస్తాం..."

"తోడేళ్లు తిరగాల యీ నేల మీద రేపట్నించి..."

చలివేంద్రం అగ్నిగుండం అయింది. జెండాల చెట్టు నాగుపాములా నిలబడి వుంది. ప్రతి ఆకూ పడగలా నిక్కపొడుచుకుంది.

"కైమా చేస్తాం... గోరీలు కడ్తాం..." అరుపులు కేకలు బావిలో గింగురుమంటున్నాయి. వరహాల బావి బలి కోరుతున్న రాకాసి నోరులా వుంది.

ఏభై ఏళ్లనాడు సరిగ్గా యిక్కడే యిలాంటి మాటలే విన్నాడు. అవే చెవుల్లో రింగుమంటున్నాయి – గాజులయ్యకి. వాహనశాల దగ్గరకి పరిగెత్తాడు "తాబేలు వేసినపుడు దేవుడా ఇహ

తిరుగులేదన్నావ్ కదయ్యా... ఇవుడు ఈ అల్లకల్లోలం ఏమిటి సామీ..." అని గోడు అంతా వెళ్లకక్కాడు. పూజారి నందివాహనం పీఠం మీద స్పృహతప్పి పడివున్నాడు.

పొలిమేర దాటి వార్త పొరుగూరి దాకా పాక్కింది.

ఆకాశం ఎర్రబడింది.

గొడ్డలి లేచింది. ఆ వేటుతో సంకు లసమరం మొదలు...


రెప్పపాటులో గుంపు మధ్యనించి విసురుగా గొడ్డలిని తోసి దబ్బున బావిలో పడింది ఒక ఆకారం. ఆక్రోశం ఒక్కసారి రెప్పకొట్టింది.

“గాజులయ్య బావిలో పడ్డాడు... గాజులయ్యా..." అన్నారు. తొంగిచూ శారు. పిడికిళ్లు సడిలాయి.

కుచ్చులపాగా కాగితం పడవలా నీళ్ల మీద తేలుతూ కన్పించింది.

జనం చెదిరిపోయారు. బావి చుట్టూ తిరుగుతున్నారు. తెలియకుండానే వాళ్ల చేతుల్లో ఆయుధాలు నేలవాలాయి. పొరుగూళ్ల జనం సైకిళ్ల మీద, కాలి పరుగున కత్తులు, కర్రలు, సోడా బుడ్లు తీసుకువచ్చి వాల్తున్నారు. “మసీదు పడగొట్టేశార్ట... అరటి తోట నరికేసి గుళ్లో శివలింగాన్ని పీకి బావిలో వేశార్ట..." ఇవి వాళ్ళు అనుకుంటున్న మాటలు. ఊరు మీద ఊరు వచ్చి పడింది.

బావిలో ఒక చోట బుడగలు వచ్చాయి. గాజులయ్య తల పైకి లేచింది. చేతులు ఆసరా కోసం తడుముకుంటున్నాయి. పాకుడుపట్టిన




వంచ మీద పట్టుదొరకడం లేదు. బుటకలు వేస్తున్నాడు.

జనం దిక్కుతోచక బావిచుట్టూ పరు గులు పెడుతున్నారు. “వంచ పట్టుకో... వంచ పట్టుకో.." అని పైనించి అరుస్తున్నారు. గాజులయ్యకి మాట వినిపించే పరిస్థితి లేదు.

గబగబా వాహనశాల తలుపులు తెరిచి రథం మోకులు తెచ్చి బావిలోకి వదిలారు. జెండాల చెట్టుకి కట్టిన జెండా గడలు లాక్కొచ్చి బావిలోకి వదిలారు.

అంత పెద్ద బావిలో గాజులయ్య కంట్లో నలుసులాగున్నాడు. ఉక్కిరిబి క్కిరి అవుతున్నాడు.

జెండా కర్రలు నీళ్ల మీద తేలిఆడు తున్నాయి. అందుకోలేకపోతున్నాడు.

జనంలో ఆదుర్దా. శోకాలు పెడుతూ ఆడవాళ్లూ, పిల్లలూ బావి చుట్టూ తిరుగుతున్నారు.

వాహనశాలలోంచి నందివాహనాన్ని మోసుకువచ్చారు. నాలుగు కాళ్ళకీ రథం మోకులు బిగించి పీఠంతో సహా బావిలోకి దింపారు. కొయ్యవా హనం నీళ్ళ మట్టానికి వెళ్లాక బాషా, పోతురాజు మోకుల మీంచి లోప లికి జారారు. వెయ్యి కళ్లు ఆత్రుతగా పైనించి చూస్తున్నాయి. వెయ్యి నోళ్ళు సలహాలు ఇస్తున్నాయి.

బావి గందరగోళంగా వుంది.

కూర్మావతారం లోపలికెళ్ళి తల దాచుకుంది.

మండూక శబ్దం వినిపిస్తోంది.


బాషా, పోతురాజు జెండా కర్రల వూతం మీద గాజులయ్య దగ్గిరకి చేరారు. రెక్కల కింద చేతులు వేసి మెల్లగా పైకి లాగారు. కొనఊపిరితో కొట్టుకుంటున్నాడు గాజులయ్య. వాలి పోతున్నాడు. అతి కష్టం మీద నంది వాహనం మీదికి చేర్చారు.

కట్టిన నాలుగు తాళ్లనీ వంద చేతులు పట్టుకలిపి పైకి లాగు తున్నాయి. మసీదు మీంచి, గాలిగో పురం గూళ్ళల్లోంచి టపటపా రెక్కలు కొట్టుకుంటూ గుంపెడు పావురాలు ఆకాశంలోకి ఎగిరాయి.

కొత్త ఊపిరితో నందివాహనంమీద పైకి వస్తున్న గాజులయ్య కరుణా మయుడిలా కన్పించాడు. మూడు పొద్దుల్నీ ముడివేసిన మంగళసూ త్రమై తళతళలాడింది వరహాల బావి.

◆

## బందరు హాస్యం




ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ శివ శంకర స్వామివారిని బందరుకు వచ్చి తమ ఇంట్లో ఆతిథ్యం స్వీకరించాల్సిందిగా ఆహ్వానించారు శ్రీ ముని మాణిక్యంగారు ఒకసారి. తీరిక లేక రాలేకపోతున్నానంటూ శ్రీ శివశంకరస్వామి వారు “నేనెట్లాగూ కొన్ని రోజుల్లో జైలుకెళ్ళాలి కదా! బంద రుకు కూడా రమ్మంటావా?" అన్నారు సరదాగా, బందరు నివాసం చెరసాల వాసంతో సమానమన్న భావాన్ని ధ్వనింపజేస్తూ. ముని మాణిక్యంగారు కూడా నవ్వేశారు.

సరదాకి అలా అన్నా, శివశంకరస్వామి వారికి బందరంటే మహాప్రీతి. తరచూ బందరు వెళ్ళేవారు. ముని మాణిక్యంగారింట్లో ఆతిథ్యం స్వీకరించేవారు. ఒకసారి ఆయన ముని మాణిక్యం గారితో మాట్లా డుతుండ గా ముని మాణిక్యంగారి సతీమణి శ్రీ మతి కాంతంగారు “అబ్బాయేడండీ? చాలా సేపటి నుండీ కనిపించడం లేదు" అంటూ ముని మాణిక్యంగారిని ప్రశ్నించారు. “మీ వాడా? అదిగో రంభాకేళిలో తన్మయుడై వున్నాడు చూడండి" అంటూ శివశంకరస్వామి వారు పెరట్లో రంభా వృక్షం నీడన (అరటిచెట్టుక్రింద) ఆటలాడుతున్న పిల్లాడిని చూపగానే అంతా ఒకటే నవ్వులు.

– శ్రీమతి గొల్లా పిన్ని(పాణ్యాం) వసుంధరాదేవి